క్లుప్తంగా

అహిల్యాబాయి ధైర్యశీలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : అధైర్య పడకుండా శత్రు సైన్యానికి ఎదురు నిలబడి విజయం సాధించిన అహిల్యాబాయి హోల్కర్ బహు ధైర్యశీలి అని హట్కార్ సమాజ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు శివాపూర్ గ్రామంలో అహల్యాబాయి జయంతిని పురస్కరించుకుని జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, హట్కార్ హన్మంత్ రావు, హట్కార్ పండరి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీగా వినీత



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీపీగా టేకులపల్లి వినీత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల వైస్ ఎంపీపీగా ఎన్నికైన వినీతకు ఇన్‌చార్జి ఎంపీపీగా నియమిస్తూ జెడ్పీ సీఈవో చందర్‌నాయక్ ఆదేశాలు జారీ చేయడంతో ఆయన ఆదేశాల మేరకు ఎంపీడీవో పర్బన్న వినీతకు ఎంపీపీగా బాధ్యతలను స్వీరించాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు తీసుకున్న వినీతకు జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో పర్బన్న, ఎంపీటీసీలు శాలువాతో సన్మానించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం



నిజాంసాగర్(జుక్కల్) : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కారానికి అధికారులు తమ వంతు కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నుంచి వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని సూచించారు.

విద్యార్థులకు సరైన సమయంలో దుస్తులు అందజేయాలి



బాన్సువాడ : ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు దుస్తులు అందజేయాలని బీర్కూర్ ఎంపీడీవో భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామంలో విద్యార్థుల యూనిఫాం కుట్టే కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు త్వరలో ప్రారంభం కానున్నాయని, అప్పటి లోగా యూనిఫాం అందేలా చర్యలు తీసుకోవాలని, త్వరగా యూనిఫాంలు కుట్టాలన్నారు. ఆయన వెంట గంగాధర్ తదితరులు ఉన్నారు.

కుట్టు మిషన్ కేంద్రం పరిశీలన



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని మహిళా శక్తి కుట్టు మిషన్‌ను అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ శుక్రవారం పరిశీలించారు. స్కూల్ పిల్లల యూనిఫాంల కుట్టడంలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. ఐకేపీ డీపీఎం వకుళ, ఎంపీడీవో పర్బన్న, ఏపీవో జగదీష్‌కుమార్, సీసీలు తదితరులున్నారు.

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ పిట్లం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కంటి వైద్యాధికారి భాస్కర్ రెడ్డి 95 మందికి కంటి వైద్యపరీక్షలు చేశారు. అందులో 12 మందికి ఆపరేషన్ కోసం బోధన్ కంటి ఆస్పత్రికి తరలించారు. 25 మందికి కంటి అద్దాలు రాసి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, కాశీరెడ్డి, సంతోష్, వైద్యులు శివకుమార్ తదితరులున్నారు.

పత్తాలేని ప్రత్యేక అధికారులు

- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్వాసన వెదజల్లుతున్న వీధులు
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు



సంగం గ్రామంలో చెత్తతో నిండిన మురికి కాల్వలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రతి గ్రామానికి వివిధ శాఖ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. అయితే వారు నియామకమై నెలలు గడుస్తున్నా ఆవైపు కనీసం ఒక్కసారి కూడా కన్నెత్తి చూడటం లేదు. దీనితో గ్రామాలు కంపు కొడుతున్నాయి. మురికి కాలువలు నిండాయని, వీధులు కంపుకొడుతున్నాయని చెప్పుకోవడానికి ఎవ్వరూ కానరావడం లేదు. నస్రుల్లాబాద్ మండలం సంగం, బొప్పాస్ పల్లి, బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామాల్లో మురికి కాలువలు నిండి కంపు కోడుతున్నాయి. పంచాయతి కార్యదర్శులు కన్నెత్తి చూడకుండా తమ గోడు వినిపించుకోవడం లేదని వాపోతున్నారు.

వీధుల్లో అధ్వానం..

వీధుల్లో మురుగు పేరుకుపోవడంతో రోగాలు పెరిగే అవకాశాలున్నాయి. అకాల వర్షాలు, ఈదురు గాలు భీభత్సం వల్ల మురుగు కాలువలు నిండాయి. నస్రుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామల్లో పంచాయతీ కార్యదర్శులు నామమాత్రపు విధులు నిర్వహిస్తున్నారని పలువురు చెబుతున్నారు. నిత్యం వీధులు శుభ్రం చేయించాల్సిన వారే కనీసం వీధుల వైపు కన్నెత్తి చూడటం లేదు. దీనితో రోడ్డుపై గడ్డి, పిచ్చి మొక్కలు మొలవడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. దీనితో రోడ్డుపై నడిచినా కూడా దుర్గంధం కొడుతోంది. గతంలో మురుగు కాలువలు నిండితే స్థానిక సర్పంచ్‌కు చెబితే సిబ్బందిని పంపించి శుభ్రం చేయించేవారు. కాని ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

నిధుల కొరత ఓవైపు..

అయితే ప్రత్యేక అధికారుల పాలన నాటి నుండి ఇప్పటి వరకు నిధుల విడుదల కాలేదని పలువురు పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. తమ సొంత డబ్బులతో పనులు చేయిస్తున్నామంటున్నారు. కనీసం సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వాలన్న సొంత డబ్బులనుండి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

శుభ్రం చేయించాలి

గ్రామంలో మురుగు కాలువలు నిండిపోయాయి. పంచాయతీ సిబ్బంది పట్టించుకోని శుభ్రం చేయించాలి. పలుచోట్ల గడ్డి మొలిచి అక్కడే మురుగు ఏర్పడి కంపుకొడుతోంది. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నాం.

– సునీల్ రాథోడ్, సంగం యువకుడు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



పిట్లంలో తనిఖీ చేస్తున్న అధికారులు



గజ్యానాయక్ తండా చౌరస్తాలో..

పిట్లం(జుక్కల్): రైతులకు నకిలీ విత్తనాలు అమ్మరాదని నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కిషన్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం ఎస్సై నీరేష్ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ తనిఖీల్లో ఎటువంటి నకిలీ విత్తనాలు లభించలేదని పేర్కొన్నారు.

బాన్సువాడ : ఖరీఫ్ పంటలు సాగు చేసుకునే రైతులు విత్తనాలు కొనుగోలు చేసే క్రమంలో జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ విస్తీరణ అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీర్కూర్ తండాలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలన్నారు.

మాచారెడ్డి : నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు తప్పవని మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం గజ్యానాయక్ తండా చౌరస్తాలో పలు విత్తన, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారిణి రమ్యశ్రీతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన విత్తనాలు, ఎరువులను అమ్మవద్దని దూకాణ యజమానులకు సూచించారు. అనంతరం షాపుల్లోని విత్తనాలు,ఎరువులను పరిశీలించారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

ఎల్లారెడ్డి : రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని ఏఈవో రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటి పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామాలలో విత్తనాలు అమ్మేందుకు వచ్చిన వారి వద్ద విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు.

వానాకాలం సాగుపై అవగాహన



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామ శివారులో వానాకాలం పంటల సాగుపై క్లస్టర్ ఏఈవో మధుసూదన్ తెలిపారు. వానాకాలం పంటల సాగు సమయంలో విత్తనాల ఎంపిక, పురుగుల మందుల పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. ఆయన వెంట స్థానిక రైతులు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ఇళ్లలో జరుగుతున్న చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కో నారెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఎక్కువగా చోరీలు అవుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెలవుల్లో ఎవరైనా ఊర్లకు వెళితే ముందస్తుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అంతేకాకుండా ఇళ్లకు తాళం వేసి ఇంటిపైన పడుకునేవారు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

ఆనవాళ్లు కోల్పోయిన నర్సరీ



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని బొప్పాస్‌పల్లి నర్సరీ ఆనవాళ్లు కూడా లేకుండా పోయింది. ఒకవైపు హరితహారంలో భాగంగా నాటాల్సిన మొక్కలను అన్ని జీపీలు సిద్ధం చేస్తుంటే బొప్పాస్‌పల్లిలో మాత్రం ఇష్టారీతిన ఉన్నాయి. లక్షలు వెచ్చించి కాపాడాల్సిన నర్సరీని గాలికి వదిలేశారు. అందులో వాటర్ ట్యాంకు వంటి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఈ విషయంపై ఎంపీవో రామును వివరణ కోరగా కోతుల కారణంగ మొక్కలు చనిపోయాయని, స్థలాన్ని మార్చి నర్సరీ ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శని ఆదేశించామన్నారు.

ఆరోపణలు రుజువు చేయాలి



ఎల్లారెడ్డి : తనపై వైస్ ఎంపీపీ చేసిన ఆరోపణలు రుజువు చేయాలని లేకపోతే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుర్మ సాయిబాబా అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిలో మాట్లాడారు. తాను ఆస్పత్రిలో రోగులు ఇబ్బందులు ఉన్నాయని ఫోన్‌చేస్తే వెళ్లానని ఆస్పత్రి సిబ్బందిని ఎలాంటి వేధింపులకు గురిచేయాలన్నారు. ఆరోపణలు రుజువు చేయలేకపోతే పరువు నష్టం దావా వేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఊషాగౌడ్, పట్టణ అధ్యక్షులు వినోద్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ నాగం గోపి కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

శబరిమాత ఆశ్రమంలో పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆశ్రమంలో పూజలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజాగౌడ్, సూర్యం, సిద్దారెడ్డి, బాపురావు, సిద్దారెడ్డి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయం ముస్తాబు



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయం పెద్ద హనుమాన్ జన్మోత్సవాలకు ముస్తాబైంది. శనివారం పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ భక్తులు, గ్రామస్తులు హనుమాన్ ఆలయాల్లో అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్నామని ఆలయ నిర్మాణకర్త పట్లోళ్ల కిశోర్ తెలిపారు.

సమాచారం..

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని అంజనాద్రి క్షేత్రంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంజనాద్రి ఆలయంలో సాయంత్రం 4.30 నిమిషాలకు నిర్వహించే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణానికి భక్తులు తరలిరావాలని వారు కోరారు.

2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

బాన్సువాడ : ఈనెల 2న బాన్సువాడలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాసాని శేఖర్‌రెడ్డి, గంజివార్ చందు తెలిపారు. ఉదయం కొయ్యగుట్ట అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తామని, తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తామన్నారు.

2న ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

కామారెడ్డి అర్బన్ : అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) కామారెడ్డి సెంటర్‌లో ఈనెల 2న ఆదివారం ఉదయం 11గంటల నుంచి ఒంటిగంట వరకు భజనలు, కీర్తన, భగవద్గీత ప్రవచనాలు, మహా ప్రసాద వితరణ ఆధ్యాత్మిక కార్యక్రమాలుంటాయని ఇస్కాన్ ప్రతినిధి వెంకటదాస్ తెలిపారు. స్థానిక రామారెడ్డి రోడ్డులోని మెడికల్ అసోసియేషన్ భవనంలోని ఇస్కాన్ సెంటర్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమాలుంటాయని భక్తులు హాజరు కావచ్చన్నారు.

సామాజిక తనిఖీల్లో అక్రమాలు బహిర్గతం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో అక్రమాలు బహిర్గతమైనట్లు అధికారులు పేర్కొన్నారు. సమావేశాన్ని శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించగా ఉపాధిహామీ అడిషనల్ డైరెక్టర్ వామన్‌రావు, సోషల్‌ఆడిట్ ఆఫీసర్ ప్రశాంత్, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ పాల్గొన్నారు. 2023–2024లో పనిచేసిన ఖర్చుల వివరాలను వెల్లడించారు. పార్మేషన్ రోడ్లు నిర్మించేటప్పుడు తక్కువ పనిచేసి ఎక్కువ పనిచేసినట్లు రికార్డులలో చూపించినట్లు తనిఖీ బృందం చదివి వినిపించారు. మస్టర్లలో హాజరు సరిగ్గా వేయకుండానే వారిఖాతాలో డబ్బులు వేశారని తెలిపారు. లక్షలాది రుపాయల బిల్లులు అయినప్పుడు ఎంపీడీవో, ఏపివో సంతకాలు లేకుండాలనే బిల్లులు చేశారని బయట పెట్టారు. అలాగే ఎంబి రికార్డులు లేకుండానే బిల్లు చేశారని ఆరోపించారు. హరితహారం మొక్కలు 60శాతం ఎండిపోయాయన్నారు. డబ్బులను రికవరీ చేయాలని అడిషనల్ డైరెక్టర్ వామన్‌రావు ఆదేశించారు. ఈ సమావేశంలో సోషల్‌ఆడిట్ ఆఫీసర్ ప్రశాంత్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఏఈ రాకేశ్, ఏపీవో శృతి, ఎస్ఆర్పీ కవిత, టెక్నికల్‌అసిస్టెంట్లు, జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగుల చిన్నారులకు వైద్య నిపుణుడు సాయికిరణ్‌గౌడ్ ఫిజియోథెరపీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రత్యేక అవసరాల పిల్లలు పది మందికిపైగా కాళ్లు చేతులకు ఫిజియోథెరపీ చేశారు. భవిత కేంద్రంలో ప్రతి శుక్రవారం క్యాంప్ నిర్వహిస్తున్నట్లు వైద్యుడు పేర్కొన్నారు. ఐఈఆర్‌పీలు శ్యామల, అశ్విని, ఆశ వర్కర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధ్వానంగా మురికి కాల్వలు



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం దేవునిపల్లి గాయత్రీ నగర్‌లో నెలల తరబడి మురికి కాలువలు శుభ్రం చేయడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాయత్రీ నగర్ రోడ్డు నంబర్ 5లో మురికికాలువల్లో మట్టి, చెత్తతో పాటు పిచ్చి మొక్కలతో దుర్వాసన వస్తుందని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. మున్సిపాల్ పారిశుధ్య కార్మికులు పనిచేసే విధంగా సానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీల కులగణన చేపట్టాలి



వినతిపత్రం చూపుతున్న సంఘం నాయకులు

కామారెడ్డి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీ కులాల సమగ్ర గణన చేపట్టి జనాభా ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించి, మున్సిపాల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ మండల పరిషత్, జిల్లా పరిషత్, సర్పంచ్, ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాయలంలో మాట్లాడారు. బీసీల కుల గణనకు రూ.150 కోట్ల బడ్జెట్ కేటాయించినందున ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కార్యాచరణ ప్రారంభించాలన్నారు. ప్రభుత్వానికి ఈ మేరకు వినతిపత్రం పంపుతున్నామన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఎ స్వామి, ఎం మోహనచారి, అబ్దుల్ అజీజ్, ఎస్ సాయాగౌడ్, జే నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు బిగింపు



కామారెడ్డి టౌన్ : పట్టణంలోని 46వ వార్డులో నీటి ఎద్దడి కోసం నూతన బోరు మోటారును బిగించారు. మున్సిపల్ నిధులతో బోరు మోటారు ఏర్పాటు చేశామని వార్డు కౌన్సిలర్ కన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి గ్రామ దేవతల ఉత్సవాలు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పొల్కంపేటలో శుక్రవారం నుంచి వారం రోజుల పాటు గ్రామ దేవతలకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం నాయకమ్మకు ఎడ్లబండ్లు, ఆదివారం బురుగుల పోచమ్మ, నల్లపోచమ్మలకు ఎడ్లబండ్లు, సోమవారం బోనాలు, మంగళవారం రేణుక ఎల్లమ్మకు ఎడ్లబండ్లు, గురువారం రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ సంవత్సరం మే చివరి వారం, జూన్ మొదటి వారంలో జాతర నిర్వహిస్తామన్నారు.

వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



కామారెడ్డి టౌన్ : నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వనితను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శుక్రవారం సన్మానించారు. కాంగ్రెస్ హయాంలో మున్సిపల్‌ను అభివృద్ధి పథకంలో తీసుకెళ్తామని షబ్బీర్ అలీ అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఇందుప్రియా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీచర్లను నియమించాలి



కామారెడ్డి టౌన్ : జిల్లా విద్యాశాఖలో ఏసీజీఈ, డీసీఈబీ పోస్టులను ప్రభుత్వ ఉపాధ్యాయులనే నియమించాలని ప్రభుత్వ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో ఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఇతర మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులకు కేటాయించవద్దన్నారు. జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు, ప్రధాన కార్యదర్శి యాదయ్య, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులున్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి



మద్నూర్‌లో మాట్లాడుతున్న అధికారి

మద్నూర్(జుక్కల్) : గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉండి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన కార్యదర్శులకు ఆదేశించారు. త్వరలో వర్షకాలం ప్రారంభం అవుతుందని గ్రామాల్లో మురికి కాలువల నిర్వహణపై చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డీపీవో నాగరాజు, ఎంపీవో వెంకటనర్సయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి క్రైం : బ్యాటరీ ట్రైసైకిళ్ల రిపేరింగ్‌పై శిక్షణకు మెకానిక్ రిపేరింగ్‌లో అనుభవం ఉన్న దివ్యాంగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ బావయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఇద్దరు దివ్యాంగులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వికలాంగుల ఆర్థిక పునరావాస పథకం కింద ఋణం అందిస్తామని వెల్లడించారు. ఆసక్తి గల దివ్యాంగులు జూన్ 3 సాయంత్రంలోగా కలెక్టరేట్‌లోని 31 గదిలో ఉన్న జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

రోగికి అవగాహన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన మధునాల మల్లయ్య 15 రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. మల్లయ్య చెట్లమందులు వాడుతూ అనారోగ్యానికి గురి కావడంతో పల్లె దవాఖాన వైద్యులు శివకుమార్ అవగాహన కల్పించారు. అతడిని ఆలన కేంద్రానికి పంపారు.

పొల్కంపేటలో ఎడ్లబండ్ల ప్రదర్శన

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పొల్కంపేటలో శుక్రవారం గ్రామ దేవతలకు ఎడ్లబండ్ల ప్రదర్శన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన భక్తులు 15 ఎడ్లబండ్లను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి గ్రామ శివారులోని నాయకమ్మ ఆలయం చుట్టూ ఐదుసార్లు ఎడ్లబండ్లు ప్రదర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది మే చివరి వారం, జూన్ మొదటి వారంలో జాతర ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

బిచ్కుంద(జుక్కల్) : రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఆయా శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీవో గోపాల్ అన్నారు. ఈనెల 2న అధికారికంగా జరగనున్న ఆవిర్భావ వేడుకల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులు వారి కార్యాలయాలలో జెండావిష్కరణ సందర్భంగా జీపీలకు రాకుంటే కార్యదర్శులు జెండా ఆవిష్కరించాలని సూచించారు.

అధికారులకు అవగాహన కరువు

బిచ్కుంద(జుక్కల్) : బడిబాట కార్యక్రమం ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా ఇప్పటివరకు అమ్మ ఆదర్శ కమిటీలు, చైర్మన్లు, సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. వారికి ఎలాంటి సమాచారం లేకపోవడంతో బడిబయట పిల్లలకు అవగాహన కల్పించడంపై సందిగ్ధత నెలకొంది. 3వ తేదీ నుంచి తాము ఎలా చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు అవగాహణ కల్పించాలని వారు వాపోతున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి..

కామారెడ్డి క్రైం : బిచ్కుంద మండలం గుండె నెమిలి వద్ద మంజీరా నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు గట్టుమీది వినోద, గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు 'సాక్షి'తో మాట్లాడుతూ, మంజీరా నది వెంబడి ఈ ప్రాంతంలో రైతుల పట్టా భూముల్లో దాదాపు 200 బోరు బావులు ఉన్నాయని తెలిపారు. ఎలాంటి అనుమతులు, వే బిల్లులు లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా కొందరు కాంట్రాక్టర్‌లు ఇసుక రవాణా సాగిస్తునారని ఆరోపించారు.